

## నాకు నచ్చిన నా కథ

1971 దీపావళి సంచిక 'యువ'లో నేనొక కథ రాశాను. 'రెండు రూపాయలు' ఆ కథ. ఇంటికెవరో చుట్టాలు వచ్చి వెళ్ళిపోతూ పిల్లల చేతిలో రెండు రూపాయలు పెడతారు. దాన్తో వస్తుంది పేచీ. ఈ కథలోని 'హ్యూమర్' నిజ జీవితంలోంచి పొంగుతుంది. ఈ కథకి గొప్ప లక్షణాలేవీ లేకపోవడం, సింపుల్గా సూటిగా వుండడం ఒక మంచి లక్షణం. తరవాత నేను తెలుసుకున్నది, ఈ కథ ద్వారా తెలియచెప్పిన సత్యం ఓటుంది—అది పెళ్ళాంబిడ్డల దగ్గర ఎప్పుడూ అప్పు చెయ్యకూడదని, వద్దని—చేస్తే అది చెల్లుపడని బాకీలా, భూమి అప్పు లాగా వెంటపడి వేధిస్తుందని. ఈ కథలోని బాకీతత్వం చాలా మందికి అనుభవంలోకి వచ్చి వుంటుంది. Literary pretentions లేకుండా రాసినందుకు కూడా యీ కథ అంటే నాకు కొంత యిష్టం, ముద్దూను.

—పురాణం సుబ్రహ్మణ్య శర్మ

# రెండ్రూపాయలు

మొన్న మధ్యాహ్నం మా ఇంటికెవరో చుట్టాలొచ్చి కాస్సేపుండి ఫలారాల్చేసి కాఫీల్తాగి వెళ్ళిపోతుంటే, మా చిన్న అమ్మాయి వెళ్ళి రిక్షా దగ్గర నిలబడి నోట్లో వేలుపెట్టుకుని చీకుతూ చూస్తూంటే— వాళ్ళు రెండ్రూపాయ కాగితాలు దాని చేతిలో పెట్టారు.

(నేను చూసీ చూడనట్లు వూరుకున్నాను)

"హుష్ వొద్దొద్దు—పుచ్చుకోకు" అంటూ మా ఆవిడ పైనుంచి యాక్షన్ చేస్తోంది మెట్లమీద నిలబడి (మేం వుండేది మేడ మీద). నేను "తీసుకోవే" అన్నాను. దానికి డబ్బు సంగతి యిప్పట్నుంచీ తెలిస్తే మంచిదని.

అది ఆ రెండ్రూపాయలూ పుచ్చుకుని రోడ్డుమీదకు వుడుంలా పరుగు

ప్రారంభించింది. దాని వెనకాతల పరిగెత్తమని నాకు కళ్లెగరేసి చెప్పింది తాను మేడ మెట్లమీదనుంచి అంగుళం యిటూ అటూ కదలకుండా మా ఇంటావిడ మరియు గృహలక్ష్మి. రిక్షాలో వెళ్తున్న చుట్టాలు చేతులూపుతుండగానే నేను పాప వెంట పరుగెత్తవలసి వచ్చింది. పాప చేతిలోని నోట్లకోసం నేను పరుగెత్తుతున్నానని వాళ్ళనుకుంటే మాత్రం నేనేంచేయనూ ?

పిల్ల నెత్తుకుని "అమ్మా అన్న కోటిచ్చేయ్" అన్నా. ఏపీ లక్ష్యం లేకుండా నిర్లిప్తంగా ఒకనోటు తీసి వాడికిచ్చేసింది. వాడు ఆ నోటు తన లిక్కి జేబులో కుక్కి దాని మెడమీద చేతులేసి ముద్దుపెట్టుకున్నాడు.

"ఏపీ కొనకు. మార్చావో దొక్క చీరేస్తాను" అంది మా ఆవిడ. అని అశ్వత్థామ హతః కుంజరః అన్నట్లు "మీరంతా సినిమాకు వెళ్ళండి అనక" అంది. మావాడి కదేమీ యిష్టంగా లేదు. ఆ నోటు జేబులో పెట్టీ తీసీ చూసుకుంటూ యిటూ అటూ పరుగెత్తుతున్నాడు. మధ్యాహ్నం ఎండలని చెప్పి మూడు మాట్లు తీసుకొచ్చి వాడిని చీకటిగదిలో తోసింది. (చీకటి గది అతనుంటే తలుపు లేసుకుని మధ్యాహ్నం ఓ గంటో అరగంటో నడుం వాల్చుకునే చోటు) మూడుమాట్లూ వాడు అడ్డంగా దుంగలా పడుకున్న తననుంచి దూకిపారిపోవటం, క్రిందకు వెళ్ళి రూపాయి నోటు అందరికీ చూపిస్తూ ఆడటం, వాళ్ళెవరేనా కుర్ర వెధవన్చేసి నెత్తిమీద రెండు మొత్తో చేతిలో పిప్పర్మెంటు బిళ్ళో బెల్లం ముక్కో పెట్టి ఆ నోటు లాక్కుంటారేమోనని యీవిడకు అనుమానం కలిగి ప్రాణం వుండబట్టక కళ్లు నులుముకుంటూ వెళ్ళి వాడి వీప్మీద రెండేసి యీడ్చుకు రావటం, యీ తతంగం అంతా చూస్తూ చాపమీద పడుకున్నా. ఈ సీను చాలా సార్లు రిపీటవటం ఒక రూపాయికి వాడు అరడజను గిల్లులో మొట్టికాయలో దెబ్బలో తినడం చూస్తూ ఆలోచిస్తున్నా. ఓ పది పైసలో ఐదు పైసలో అయితే ఇన్ని దెబ్బలు పడుండవు కదా అనే సానుభూతి లాటిది కలిగింది.

మా చంటిదానికి రూపాయి కాగితం గురించి ఏపాటి పరిజ్ఞానంవుందో తెలుసుకోవాలనే అభిప్రాయం కలిగి "అమ్మలూ ఏంతే అది ?" అంటూ ముద్దుగా పలకరించా.

"ఐదు పైసలిత్తా నా కిచ్చేత్తావా ?" అన్నా.

"వూపాయి ఫో" అంది. అని కళ్ళు చిత్రంగా తిప్పి ఆ రూపాయి నోటును సాగి దీయడం మొదలెట్టింది.

"దాన్నేవనకండి. అది చింపి రెండు ముక్కలు చేస్తుంది." అని మా చంటిది

అప్పుడే నా మూలకంగా రూపాయి నోటును ధ్వసంచేసినట్లు గాబరాపడుతూ మా ఆవిడ లేచింది. కంగారులో జారిపోయిన కొప్పును మోచేత్తో త్రాచుపాముని లాగినట్లు లాగి బిగిస్తూ. లేచినప్పుడు నీళ్ళలోనుంచి ఏనుగ లేచినట్లున్నా ఇప్పుడీ పోజు మాత్రం యీవిడకు బ్రహ్మాండగా వుంది, అని లోపల్నే మెచ్చుకున్నా.

"ఈ రెండ్రూపాయలూ మార్చి చెరో అయిదు పైసలూ యియ్యి. ఓ ఇరవై రోజులు కాలక్షేపం అవుతుంది" అన్నా. కానీ నా సలహా యెవరిక్కావాలి బోడి సలహా!

ఈలోగా ఇద్దరు సపోటావాళ్ళను, ముగ్గురు ముంజెలవాళ్ళను మేడ మీదకు పిల్చుకొచ్చారు యీ యిద్దరు తుంటర్లూ కలిసి. లక్ష్మి చంచలం కదా! అది ఎప్పుడు బయటకు పోదామా అని చూస్తూ వుంటుంది. ఈ రహస్యం తెలిసినదానికి మల్లే మా ఆవిడ వాళ్ళతో పనిగట్టుకు పోట్లాడి బేరం కుదరనివ్వకుండా చేసి వాళ్ళను తిప్పి పంపేసింది. ఈ కుట్రను గ్రహించినదానిలా మా చంటిది అరిచి గొడవచేయబోతే, దాని దగ్గర రూపాయి లాక్కొని బొడ్లో దోపేసి ఆ కుర్ర వెధవను యీడ్చుకొచ్చి పవిట చెంగును వాళ్ళిద్దరి మీదా కప్పి నేలమీద పడేసి వాళ్ళ మీద చేతులూ కాళ్ళు అడ్డంవేసి తిరిగి నిద్ర కుపక్రమించింది.

ఎలా నిద్రపోతారో ఆడాళ్ళు తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. వాళ్ళ మెదళ్ళు ఎంత చిన్నవో వాళ్ళ శరీరాలు అంత.... సంబంధం లేనట్టు ఎదిగి పోతాయి కావల్ను. అందుకే, లాజిక్కు లేకుండా వుంటాయి వాళ్ల మాటలూ, చేష్టలూ, చూపులూ అన్నీ.

"రోజూ యింతసేపిలా తాజాగా నిద్రపోతుందీ యీవిడ?" నాకు అనుమానంతో కూడిన అసూయ కలిగింది. నేనేమో చవటలా ఆఫీసులో కుర్చీకి అతుక్కొని అడ్డమైన కాగితాల్తో-రాస్తూ కుస్తీపడుతూ చెమటోడ్చి సంపాయిస్తూంటే యీ అమాంబాపతు సరుకంతా హాయిగా యిలా కులుకుతూ నేలమీదపడి దొర్లుతూ కాలక్షేపం చేయటం నా కొట్టే సమ్మతంగా లేదు.

నాకు పగలు నిద్రపోయే అలవాటు లేదు. మేకులా అలా కూర్చోవలసిందే! బల్లమీద పుస్తకాలు కాస్సేపు కెలికి "చెస్ పట్టావే-రెండెత్తులు వేద్దాం" అన్నా.

ఏ కళనుందో చటుక్కున లేచివెళ్ళి ఒక మామిడిపండు తెచ్చి "నిన్న మూడు డజన్లు కొన్నాను గుమ్మందగ్గర బేరవాడి. ఇదొక్కటే మిగిలింది తినండి" అని నా ఒళ్లో పడేసింది కళ్ళు మూసుకుని నడుస్తూ. ఎత్తుకు పై ఎత్తు అంటే యిదే కావల్ను.

"డజను ఎట్లా కొన్నావన్నా" ను పళ్ళు బిగించి.

నిన్న మూడు డజన్లు కొంటే యివాళ్ల మధ్యాహ్నం దాక ఆ సంగతి వీళ్ళకు గుర్తురానందుకు నాకు లోపల అసంతృప్తిగా వుంది. పండు చూస్తే క్రింద ఆకు పచ్చగా వుంది. అక్కడ టెంక పుల్లగా వుంటుంది. పైగా అందరూ వదిలేసిన పండయి వుంటుంది. నా అనింపార్టెన్సుకి గింజుకుంటూ, ఆ పండు తినలేకా వదలలేకా దిక్కులు చూస్తూ కూర్చున్నా.

నా చేతిలో ఆ పండును చూడగానే మా యిద్దరు అజ్ఞానులూ లేచి నా చేరోవైపుకి వచ్చి నిలబడి దానికేసే చూస్తూ 'వీడు మనకు పెడతాడా పెట్టడా ? పెట్టకుండా ఎలా తింటాడో చూద్దాం' అన్నట్లు పోజు పెట్టారు. పిల్లలంత నిర్మోహమాటస్తుల్ని నే నెక్కడా చూడలేదు. పండు కొంచెం చీకి రుచి చూసి టెంకొకరికి తొక్క ఒకరికి యిచ్చేసి వెళ్ళి పంపువద్ద చేతులు కడుక్కుని దండానికి వంకీలకు వ్రేలాడేసిన బట్టల్ను చీరల్ను లంగాల్ను జాకెట్లనూ చూస్తూ కూర్చున్నా.


కుర్ర వెధవలు కొంచెంసేపు పండు తిని ఆ టెంకతోనూ తొక్కతోనూ యుద్ధాలు చేసి వెళ్ళి పంపు త్రిప్పి బాత్రూంలో పడ్డారు. పిల్లల్లో అల్లరిచేసే శక్తి దారుణంగా వుంటుంది. బాత్రూంలో పడేసిన ఎంగిలి కంచాలూ అంట్ల గిన్నెలూ తెచ్చి హాల్లో పరిచారు. అక్కడే కూర్చుని బట్టల సబ్బుతో వాళ్ళ అమ్మను ఇమిటేట్ చేస్తూ అంట్లు తోమడం ప్రారంభించారు. హాల్లో అంట్లు తోముకోరని వాళ్ళకు తెలీదు.

ఇంతలో మెట్లదగ్గ రెవరో కూర్చున్నారని వచ్చి శుభ్రంచేయమని పితూరీ వచ్చింది. అప్పుడీవడ అట్నుంచి యిటు దొర్లి పెద్ద పిల్లను వెళ్ళి చూసి రమ్మంది. అది చూసొచ్చి మనవాళ్ళు కాదు అని చెప్పింది.

'ఇదివరకోటి రెండుసార్లు యిలానే అంటే శుభ్రంచేసి వచ్చాం వెర్రిపీనుగుల్లా. వీళ్ళకి యిదో అలవాటు అయిపోయింది. వూరుకో—' అని ఆవిడ కేసు కొట్టేసింది.

పిల్లలను నేను 'హాయ్ ! హుష్ ! హమ్మయ్య !' అంటూ కేకలు వేస్తూంటే వాళ్ళు నన్నో జోకర్ కిందకట్టి వాళ్ళ ఆటలు వాళ్ళాడుతున్నారు.

'అమ్మొస్తుందర్రా' అని దయ్యం మొస్తుంది కాసుకోండన్నట్లు భయపెట్టాను. ఆవిడను భయంకరంగా చిత్రించటం అవసరమే ననిపించింది. ఆనందంగా కూడా వుంది. అప్పుడు 'ఇదిగో యిటు చూడు. పిల్లలు అల్లరి చేస్తున్నారు.' అని నేనూ సుప్రీంకోర్టుకి ఫిర్యాదు చేశాను. (లెట్ హర్ సెటిల్ మేటర్స్




అతను ఈ రచయిత్రి రాసిన నవల్లో హీరో!!

బిఫోర్ దె బికం డెవిల్స్) అవిడ లేచింది (మహంకాళిలా). లేస్తూనే నెత్తి మొత్తుకుంది. పళ్ళు పటపట లాడించింది. ఎదురుగుండా బొమ్మల పుస్తకం తిరిగేస్తున్న పెద్దదాన్ని తిట్టింది. కొట్టబోతే అది పారిపోయింది. ఆ హాలు స్థితి చూసి 'మీరేం చేస్తున్నారు' అని నా వైపో లుక్ పారేసి, ఆ యావత్తు భీభత్సానికి కారకులైన దుష్టశక్తుల్ని రెంటినీ తరిమి పట్టుకుని విచక్షణారహితంగా బాదటం మొదలెట్టింది.

"ఏం కొంప? వెధవ కొంప. ఏం పిల్లలు వెధవ పిల్లలు. ఏం మొగుడు—' అని ఆగి మళ్ళీ మొదలెట్టింది. 'కుక్క జన్మా నక్క జన్మా నయం. ఏ జన్మమ్మా ఆడజన్మ? దీని మొహం తగలెయ్య. ఈ పెద్దముండుందన్న మాటే గాని పోతులా తిని కూర్చోటానికి తప్ప ఓ పని ఆసరానా, నా శార్దావా? ఏళ్ళొచ్చాయ్ ఏళ్ళు. ఎందుకూ? తిన్న కంచం ఎత్తుకోకుండా లేచిపోతూంది టింగురంగా మంటూ. మహారాణీ లాగ గడుస్తున్నాయ్ దీని రోజులు. ఒళ్ళు కందిపోతుందేమో నన్నంత భయం. కుర్చీలు దిక్కుండా కూర్చుంటారు మొగ వెధవలూ, ఆడపీనుగులూ కూడా—అని నాకేసి చూసి "మిమల్నెవరన్నారు—మీ రూరుకోండి. మీరు వూరుకుండబట్టే కొంప యిలా తగలడింది. గడేకారి వెధవలు—ఒక మాటంటే అభిమానం లేదు. పౌరుషం లేదు. ఒక్కర్తి ఎలా చస్తుంది,

అదీ ఓ అమ్మ కన్నబిడ్డేకదా అనే జ్ఞానం ముందొద్దూ యింటికయిన వాళ్ళకి. వుష్షూ! అదేం లేదు. ఇదేదో సత్తరవో హోటలో అన్నట్లుంటారు అంతా. ఈ ముండ పుట్టినప్పుడు ఎలకలా పుట్టింది. దీనికసలు వూపిరుంటుందో వూడుతుందో అని అంతా హడలి చచ్చాం. ఇప్పుడు నా ప్రాణాలు పీకి పిండడానికి యిది కూడా తయారు. చాకిరీ చేసి చచ్చిచచ్చి వుంటే ఒక్క క్షణం అలా నడుం వాల్చుకుందామంటే పడనీరు. కాస్సేపు కన్ను మూతపడి యిట్టే తెరిచానో యిల్లంతా నానా గందరగోళం. అక్కడి దిక్కడా యిక్కడి దక్కడా-సర్దటం తుడవటం కడగటం నా బ్రతుకంతా యిలా అలుగుడ్డలా వెళ్ళమారి పోవల్సిందే? ఛస్తేనే నాకు విముక్తి! ఈ వెధవోమూలా, ఆ వెధవోములా అర్చుకుంటూ ఎంతకని వీళ్ళ వెనకాల పడను. ఈ వెర్రిపీనుగ అస్తమానూ యిలా అరుస్తుందేమో అనుకోరూ? నా నోరు బైట పారేస్తున్నారు. వాళ్ళు బయట పడిపోతున్నారు. నా నోట మంచి ముక్క రావడం మానేసి అన్నీ పరుషవాక్యాలే వస్తున్నాయి. ఇదేదో పెద్ద రాక్షసి పీనుగ అని నలుగురూ అనుకోవడానికి. నోరు మూసుకు పడుందాం ఓ మూల అంటే వుండనివ్వరమ్మా యీ పిల్లలూ, యీ సంసారమూనూ. లొడితెడు వెధవ, లాగులో తప్ప వెళ్ళడు. అంత వుగ్గబట్టుకుని లాగంతా పాడయేదాకా ఏడవడం ఎందుకూ? ముందే ఆ ఏడుపేదో ఏడవకూడదా? రోజుకి అరడజను లాగులు ఖరాబుచేసి మూలపారేస్తే అవన్నీ ఉతికితేనే కాని మర్నాడు తొడుక్కోడానికి లాగుండదు. ఈ వెధవ లాగులు ఉతికి విస్తరిముందు కూర్చుంటే అన్నం తినబుద్ధవడం లేదు. పిల్లలు ముద్దు కాని పీతుళ్ళు ముద్దా? ఇహ ఆయనున్నారు. ఆయన తిరుగుళ్లూ ఆయన ప్రపంచం. ఆయన గొడవ అదంతా వేరు. వేళకు విస్తరిముందొచ్చి కూర్చోటానికే నన్నేదో ఉద్ధరిస్తున్నట్లు బెట్టుచేస్తారు. బెట్టెవరిమీద? ఇహ నేనేగా అందరికీ లోకువ. ఇంట్లో యిది వుంది, యిది లేదు, వీళ్లొస్తున్నారు. వాళ్లు వెళ్తున్నారు. ఇది అవసరం. ఇది అనవసరం. ఇది ముఖ్యం, ఇది అముఖ్యం—ఈ గొడవేం పట్టదమ్మా! ఇహ నే నెన్నిటికని ఏడవను? నావల్ల ఏమిటవుతుంది? ఛస్తే ఛస్తారు. ఉంటే వుంటారు, పోతే పోతారు. ఏది జరగాలో అది జరుగుతుంది. నా కెందుకీ రొష్టూ—నా కెందుకీ హైరాణా? మీరంతా కట్టగట్టుకుని ఏ ఏట్లో దూకుతారో దూకండి. మరి నేను మాట్లాడను. నా పని అయిపోయింది" అని ఆవిడ లెక్చరిచ్చేసి, హాలంతా కడుక్కుని శుభ్రం చేసుకుని ఆ గిన్నెలన్నీ తోముకుని ప్రాణం చల్లబడటానికి బాత్రూంలోకెళ్ళి స్నానంచేస్తూ కూర్చుంది. ఆ క్షతగాత్రు

లిద్దర్నీ నేను దగ్గరకు తీసుకుని వెనక వరండాలోకి తీసుకెళ్లి సబ్బెట్టి రుద్ది స్నానాలు చేయించా. ఇంతలో జ్ఞాపకం వచ్చి "ఇదిగో రూపాయి తడుస్తుంది" అని కేకేశా. ఈవేళ తెల్లారి లేచాక నేను తెలివైన పని చేయటానికి దొరికిన అవకాశం యిది ఒక్కటే. రోజుకి కనీసం ఒక తెలివైన పని చేయాలి కదా!

"అయ్యో నా మతి మండా" అని బాత్రూంమీద వ్రేలాడుతున్న చీరంతా దులిపి ఆ నోటు తీసి యివతల పడేసింది.

మా చంటిది వెళ్లి మళ్ళీ ఆ కాగితాన్ని తెచ్చి దాన్ని తిరగేసీ బోర్లేసీ ఆడు తోంది. అప్పుడు "నా రూపాయో" అంటూ ఎవరో కొట్టినట్టు మా కుర్రాడు (యంగెస్టాఫ్ ది లాట్) ఏడుపుకి లంకించుకున్నాడు. అవును వాడి రూపాయి వాడి బుష్‌కోటు లిక్కి జేబులో వుండిపోయింది. వాళ్ళమ్మ యిందాక వాడి తడిసిన బుష్‌కోటును హాల్లోంచి బాత్రూంలోకి వుండచుట్టి బంతిలా విసిరేసింది మేమంతా చూస్తూండగా.

"పద పద నీ రూపాయి తెచ్చుకో" అని వాడ్ని బాత్రూంకేసి నెట్టాను. ఆ తడిచొక్కా అవతల్నుం చివతలకు టోపిలా ఎగిరొచ్చి పడింది. నిజంగా మన ఆడవాళ్లకు సరైన ట్రయినింగు యివ్వకపోబట్టి కాని యిస్తే ఎన్నెన్ని సర్కస్ ఫీట్లయినా అవలీలగా చేయగల్రు. అందుకే జీవితం ఒక సర్కస్ లాటిదని అన్నారెవరో! అయితే రింగ్‌మాస్టర్‌కీ జోకర్‌కీ తేడా తెలియని సర్కస్ జీవితం మంది అనుకుంటూ ఆ చొక్కా అందుకున్నాను. అందులో నోటు మడతపెట్టి వున్నందున కొంచెం తడిసింది. తడిసినందుకు వాడు ఏడుపు వదల కుండా సాగించాడు కాళ్ళతో నేలను బాదుతూ.

స్వయంకృతాపరాధం కనుక ఆ నోటు తీసుకుని యిద్దరం వెళ్ళి ఎండలో కూర్చున్నాము. ఇప్పుడే ఆరిపోతుందని నేను మావాడి కభయమిచ్చాను. కాని ఒక తడిసిన రూపాయి నోటు గురించి ఎండలో కూర్చోటం అంత తెలివైన పని కాదు. మమ్మల్ని చూసి ఎవరైనా నవ్వొచ్చు. ఇంతలో ఒక బ్రెయిన్‌వేవొచ్చింది. వీధిలో రెండిళ్లవతల రావణాసురుడు చెరిచిన రంభలా ఒక లాండ్రీ వుంది. అక్కడకు వెళ్తే రూపాయి నోటును కమ్మగా ఇస్త్రీచేసి యిస్తాడు. మళ్ళీ కొత్త నోటులా తయారవుతుంది. పిల్లాడు ఏడుపు మానేస్తాడు కదా అని జాగ్రత్తగా తలుపు దగ్గరసా వేసి, ఒకపిల్ల చంకనెత్తుకుని కుర్రాడిని నడిపించు కుంటూ పిల్లల తండ్రిలా లాండ్రీ దగ్గరకెళ్ళి నిలబడ్డాను.

మనం బట్టలిచ్చినపుడు వాడు రాక్షసుళ్ళా కనపడతాడు కాని లేకపోతే వాడు

చిరుమందహాసం ఒలికిస్తూ కడు యోగ్యుడులాగే దర్శనమిస్తాడు, వాడి పెళ్ళాం చాలా అన్‌సైజు మనిషి. చింతమొద్దులా వుంటుంది. అది వెళ్ళి డబ్బు లడిగితే వుతికిన వాటికీ వుతకని వాటికీ పారేసిన బట్టలకి కూడా డబ్బు లిచ్చేస్తారు యిల్లాళ్ళు కిక్కురుమనకుండా. పాతికమంది స్టూండెంటు కుర్రాళ్ళని రోడ్డు మీద నిలబెట్టి మధ్య తను నిల్చొని జలకడినట్టు కడిగేయకలదు. అది పోట్లగొడ్డు. దాని జోలికెవరూ పోరు. రప్పలా తలమిడి గుడ్లూ ఆ వీధికంతా అది భారత మాత! దాన్ని చూస్తే మా ఆవిడకి చాలా భయం. మా కుళ్ళు బట్టలు మా మాసిన బట్టల పెట్టెలో వుండగా, దాని దగ్గరున్న రేవు బట్టలు తీసుకోకుండా వచ్చి కూర్చుని అవాకులూ చవాకులూ వాగి అది డబ్బులట్టిగెళ్ళి పోతుంది. అది ఇల్లాళ్ళను నిలవనియ్యదు. కాళ్ళ కింద నిప్పులోసి డబ్బులు లేవన్నా మఠం వేసుకు కూర్చుని డిఫినెట్ ఫైనాన్సింగు గురించి నీతి సూత్రాలు వల్లిస్తుంది.

"ఏంటమ్మగోరూ! మా కేవన్నా నెల జీతాలా పాడా—ఎండలో పగలల్లా రేవుకాడ చస్తే ఎప్పటి డబ్బు లప్పు డిచ్చెయ్యటానికి లేవు పొమ్మంటారు. చీటీ కట్టాలా? బొగ్గుల కెంతయిపోతున్నాదని. లాండ్రీ అద్దె పాతిక రూపాయలు. నీలిమందు ఖర్చు, సోడా ఖర్చు, రిక్షా ఖర్చు లెంత పెరిగిపోయాయో మీకేటి తెలుసుద్ది? బియ్యం సేరు రూపాయన్నర. మీ మదేలు తాగుడు ఖర్చు రోజుకి రెండ్రూపాయలు. నా సినిమా ఖర్చు వారానికి మూడ్రూపాయలు. ఆ కోక యిప్పి పారేసి నా కిచ్చికూడదా? ఇంద యీ చీర తీసుకోమని మీ రివ్వక పోతే నా కేటుంది? నవార్లుతకాల, బొంతలుతకాల, దయ్యాల్లాటి దుప్పట్లు లుతకాల, మీ కుళ్ళుగుడ్డలన్నీ మేమే ఉతకాల, మరేటి డబ్బుల్లేవంటే ఎలాగమ్మ గారూ? చూడండి ఇంత మేడద్దికి తీసుగునున్న మా రాజులు—మాకిస్తే మీ కేటి పోతుంది? మా కెవరడిగినా లేదంటారు కాని మీకు పది రూపాయప్పు యిట్టే పుడుతుంది. వర్షాకాలం బట్టలారవు. ఓసారి ఫానేపించి మీ చీర ఆరబెట్టి యిస్త్రీ చేసి ఇచ్చాను కదా! మా వోడు పేతి రేడియో కొందావన్నాడు. ఆవకాయ ముక్క పారేయండమ్మగోరూ—జివ్వ సచ్చిపోనాది," అంటూ వూదరగొట్టేస్తుంది.

అది నన్ను చూసి పోల్చుగుంటో లేదో తెలీదు కాని నేను లాండ్రీ గడప దగ్గర నిల్చోగానే "రండి రండయ్యగోరూ! కనకమ్మగారి అయ్యగా రొచ్చారారే—" అని నిద్రపోతున్న మొగుడ్ని ఓ కుదుపు కుదిపింది. వాడు తెల్లగా ఉతికిన బట్టల మీద పాలసముద్రంమీద పవ్వళించిన శేషశాయిలా పడుకుని

గుర్రు పెడుతున్నాడు. వాడి నోట్లోంచి వస్తున్న గుర్రుకి లాకు తలుపులు దడ దడ లాటినట్లు వాడి పెదిమలు మీసాలు కదుల్తున్నాయి. ఇస్త్రీపెట్టె ఎర్రగా కణ కణలాడుతూ నోరు తెరుచుకున్న చిరుతపులిలా వుంది.

నేను కనకమ్మగారి అయ్యగార్ని కానని కనకమ్మగారి పెనిమిట్నని చెప్పు కున్నాక— "అయ్యబాబో తమ రేటిలా గొచ్చారని" బోల్డు మర్యాద చేసి అడి గింది. రూపాయి నోటు తడిసిపోయింది. ఇస్త్రీ చేసి పెట్టాలన్నా.

"రూపాయి నోటు తడిసిపోతే మీకేటి బాబూ?" అని నోటు తీసుకుని చిరుత పులి నోరుమూసి పైనో తువ్వాలా పరిచి రెండు పావులు పాని హాట్ హాట్గా పొగలు గక్కుతున్న రూపాయి నోటుని నా చేతిలో పెట్టి "అమ్మగారిని పురుటికి ఎప్పుడంపిస్తారు బాబూ" అని అడిగింది.

పురుదేవిటి ఫామిలీ ప్లానింగు ఆపరేషను చేయించుకున్నాను కదా అని కొంచెం గాబరాపడ్డాను.

"తొమ్మిదో నెలేవిటి?" అన్నాను.

"అదేటి బాబూ—మీరు జానకమ్మగారి పెనిమిట్నని చెప్పారిప్పుడు కాదంటు న్నారు."

"ఈ పిల్లల సాక్షిగా నేను జానకమ్మ భర్తనే—"

"అయితే మీరు లావుపాటి మెల్లకన్ను జానకమ్మగారి తాలూకా? కాదా? చెయ్యిలా గీడుస్తాది. ఇదిగో యిలా కాలెగరేస్తూ ధనలక్ష్మిలా నడుస్తాది." అని అభినయం చేసి చూపెట్టింది. మా పిల్లలు నవ్వారు.

"నేను లావుపాటి జానకమ్మ మొగుడ్ని." అన్నాను ఖచ్చితంగా.

"అహ్హా! సూదిముక్కు లేడికళ్ళు ఉంగరాల జుత్తు కుక్క తరువుకొస్తే అడవిలో తేళ్ళు పరిగెట్టినట్లు పరిగెడతా వుంటాది. ఆ పచ్చ డాదాలోని జాని కమ్మగోరా అమ్మ..." ప్రవాహాన్ని ఆపుచేసి, "అవునవును. ఆ జానికమ్మ సూదిముక్కు లేడి కళ్ళూ"

"ఆ యమ్మకేం బంగారపు బొమ్మ" అని సర్టిఫికెటిచ్చింది. నేను యింకేం అడుగుతుందో చలివిడీ పాకంలా పట్టుకు వొదల్దని వస్తానని చెప్పి పిల్లల్ని బరా బరా లాక్కెంటూ రోడ్డుమీద కొచ్చాను.

రిబ్బన్లూ మొలతాళ్ళవాడో పక్కనుంచి, బూరలమ్మేవాడో పక్కనుంచి, టమటమాల బండివాడో పక్కనుంచి, మరమరాలూ బఠాణీలవాడో పక్కనుంచి నా ప్రాణానికి నాలుగు వైపులనుంచి నలుగురూ శత్రువుల్లా పోగయ్యారు.

ఎప్పుడు విడిపించుకున్నారో నా పట్టు విడిపించుకుని వాళ్ళ దగ్గరకు పారిపోయి కొనమని గెంతుతున్నారు పిల్లలిద్దరూ. నేను ఆలోచించుకోటానికి వ్యవధి లేకుండా పిల్లలు నడిరోడ్డులో మారాం మొదలెట్టారు. ఆ నలుగురు శత్రువులూ అలా నిలబడిపోయారు నన్నే గమనిస్తూ.

రిబ్బన్లవాడిదగ్గరో రెండుమూడు రిబ్బన్లు తీసుకున్నాను. రెండు టమటమాల బిళ్ళ కొన్నాను. మరమరాలూ బఠాణీలు కొని లుంగిలో రెండు మూటలుగా కట్టి ఎత్తి పట్టుకుని ఇంత చేశావా భగవంతుడా అని బఫూన్లా యింటివైపు నడక ప్రారంభించాను. మొత్తం బిల్లు రిబ్బన్లవాడికి రూపాయిన్నర, రెండు టమటమాల బిళ్ళు రూపాయిపావలా, మరమరాలు పావలా, బఠాణీలు అర్ధరూపాయి. నా దగ్గర రూపాయ్ వుంది. వాళ్ళందర్నీ వెనకేసుకుని ఇంటి దగ్గరిద్దావని గేట్ మార్చి చేయించి తీసుకొచ్చాను.

సూదిముక్కూ లేడికళ్ళ జానకమ్మ వీధిలోనే నిలబడి మే వెక్కడికి పోయామా అని చూస్తూంది గావల్ను మా ప్రొసెషన్ని చూసి 'ఏం జరిగిం దేం జరిగింద' ని అదుర్దాగా అడిగింది.

"ఏ వీలేదు. హేవీలేదు. నువ్ లోపలికి నడు—" అని రిబ్బన్లవాడికి రూపాయిన్నర, టమటమాల బిళ్ళకి రూపాయి పావలా, మరమరాలూ బఠాణీలకి ముప్పావలా యిచ్చేమని చెప్పాను.

"ఏవిటీ? హేవిటేవిటేవిటీ? ఈ రిబ్బన్లు రూపాయిన్నరా? ఈ బిళ్లెందు క్కొన్నారూ? వీటికి రూపాయా? ఇవి పావలా మరమరాలా? ఇవి అర్ధ రూపాయి బఠాణీలా? హవ్వ!" అని నోరు నొక్కుకుని "యిచ్చెయ్యండి. ఇవి వాళ్ళకిచ్చెయ్యండి. మీ మొహం చూసి మిమ్మల్నెవరో బాగా టోపీవేశారు. ఇచ్చేసి వాళ్ళను వెళ్ళమనండి. శుద్ధ దండగ." అని రూలిం గిచ్చేసింది.

నాకు ముచ్చెమటలు పోశాయి. వీధిలో కెళ్ళానంటే వాళ్ళూరుకోరు. ఇంట్లో యీవిడూరుకోదు. పిల్లలు వాళ్ళమ్మకేసి కోపంగా నాకేసి జాలిగా చూస్తున్నారు. పైగా మేవు దారిపొడుగూతా బఠాణీలు నవుల్తో వచ్చాము. పిల్లలజేబుల్లో పోశారు వాళ్ళే.

ఆఖరికి నేనే తెగించి పెళ్ళాంముందు హీనపడిపోవడం యిష్టంలేక— వీధిలోకెళ్లి,

"ఏవిటోయ్ మరీ కాసిని మరమరాలు బఠాణీలిచ్చి యివి ముప్పావులా అంటావు? ఆడవాళ్ళదగ్గరో బేరమూ, మగాళ్ళదగ్గరో బేరమూనా? ఆ కొత్తలేవిటి? ఆ




డొక్కు లేవిటి? మరమరాలికీ, బఠాణీలకీ కలిపి అర్ధరూపాయి చేసుకో—మరి మాట్లాడకు" అని రిబ్బన్లవాడికేసి తిరిగి—

"ఈ వెలిసిపోయే రిబ్బన్లు యిచ్చావేమిటయ్యా సాయిబూ, పైగా రూపాయిన్న రేవిటి? రూపాయి చేసుకో—మా ఆవిడ ముప్పావలాయే యిమ్మంటోంది. అయినా రిబ్బన్లకూడా యింత ధరేవిటి? అలా యిస్తే యివ్వు, లేకపోతే తీసేసుకో" అంటూ నిర్మోహమాటంగా మా ఆవిడకు వినిపించేలా అనేసి టమ టమాల బండి అబ్బాయికేసి తిరిగి బిగ్గరగా కేకలెట్టాను.

"మా పిల్లలకి చెరో చేతిలో చెరో బండి పెట్టింది నువ్వేనా? నన్నడక్కుండా నా పర్మిషన్ లేకుండా పిల్లలచేతిలో బళ్లు పెట్టి నువ్వు రూపాయిపావలా ఇచ్చే మంటే యిచ్చేడానికి నేనేమీ తెలివితక్కువవాణ్ణి కాదు. అసలీ వీధిలో నువ్వు కనిపించావంటే జాగర్త! పావలా పావలా చేసుకో. అట్నే నే నెరగ ననుకోకు. నా చిన్నప్పుడు అణా అణా. అప్పుడు మట్టిచిప్పకి కాదు, కొబ్బరి చిప్పకే వల్చటి చర్మం అంటించేవారు. దానిమీద దెబ్బపడితే రణగేరే అనుకో. నువ్విప్పుడు జిగురుపూసి కాగితం అంటించావు. నువ్వింకా యీ సందు తిరక్కుండానే కాగితం విరిగిపోతుంది. ఇచ్చెయ్ జానకీ, వాళ్లకు డబ్బులిచ్చేసి పంపించు" అని లోపలి కెళ్ళిపోయాను నా బెటర్‌హాఫ్‌ని సెటిల్ చేయమని.

వాళ్ళు ముగ్గురూ డబ్బులిస్తానని నా వెనకాలే వచ్చినవాళ్ళు నా ఉపన్యాసం విని దంగైపోయారు. మా ఆవిడ ఒక్కొక్కరితో "ఆయన కేవీ తెలీదనీ, వెర్రిబాగులోడనీ, యిలా నష్టాలు తెస్తూంటే తను తెలివిగా సర్దుకొస్తూ వుంటుంద"నీ నన్నో పది అని తను వాళ్ళని పొగిడి ఒక టమటమాల బండీ వాపసుచేసి, రిబ్బన్లని మళ్ళీ మార్పించి మొత్తానికి నేను మూడ్రూపాయల పావలా యివ్వవలసిన చోట రెండ్రూపాయలకన్నా తక్కువే యిచ్చి హైరాణపడిపోతూ మహిషాసుర మర్దనిలా లోపలికొచ్చి "ఈ వీధిలో వాళ్ళదగ్గర బేరాలు మీకు తెలియవు. వాళ్ళు పావలా చెబితే మనం పదిపైసల కడగాలి. సగానికి సగం ఎక్కువ చెప్పి డబ్బు దోచేస్తారు." లెక్చరిస్తోండగా బూరాలవాడొచ్చాడు "డబ్బులిమ్మంటూ". వాడు దారిలో ఆగాట్ట మరో బేరమేదో వస్తే.

"బండీ కొంటే మళ్ళీ బూరాలెందుకు కొన్నారు?" అని నన్ను తీక్షణంగా అడిగింది. బండి కొన్నప్పుడు బూరాలు కొనకూడదు కావును. ఆ సంగతి నాకు తెలీనట్లు నేను నిలబడ్డాను.

"బూరాలేవర్రా వెధవల్లారా?" అంది వాళ్ళకేసి తిరిగి.

"పేలిపోయాయ్" అన్నారు వాళ్ళు బిక్కమొగాలేసుకుని. దీన్తో ఆవిడకు చిర్రెత్తుకొచ్చింది.

"మీరు బూరాలు వాళ్ళ చేతుల్లో చూశారా?" అని నన్ను క్రాసెగ్జామిన్ చేసింది.

"చూశాననుకుంటాను" అన్నాన్నేను కంగారుపడి.

"అయ్యో నా మతిమండా—మీ రెక్కడ దొరికారండీ నాకు. బూరాలు కొన్నారో లేదో గుర్తులేదు మీకు. వాడెవడో వీధిలోకొచ్చి డబ్బులడగ్గానే యిచ్చెయ్యమంటున్నారు. ఈ సంసారం యింకెందుకైనా పనికొస్తుందీ? ఇక యీ కొంప బాగుపడదు." అని వాడికేసి తిరిగి "పిల్లల చేతిలో బూరాల్లేవు. నువ్విచ్చావో యివ్వలేదో—మళ్ళీ యిచ్చేయ్. యిచ్చేసి డబ్బులట్టుకుపో—నన్నాట్టే విసిగించకు." బూరాలవాడు తమాయించుకుని—

"జేబులు సూడండమ్మగారూ—" అని "బాబూ ఎర్రబూరా నీకూ పచ్చబూరా చెల్లికీ యివ్వలేదూ" అని వాళ్ళనడిగాడు. వాళ్ళు బుర్ర వూపారు.

"అటికి పిడతల్లాగ తలకాయ లూపుతారు" అని విసుక్కుని మావాడి జేబు వెతికింది. జేబులో రెండు బూరాలూ వున్నాయి.

"ఇవి తీసుకుని మంచివిచ్చేయ్. డబ్బులివ్వకుండా బూరాలు పేలిపోతే నువ్వే మళ్ళీ మంచి బూరాలివ్వాలి. నువ్వు వూత్తోంటే పేలిపోతే మళ్ళీ మరోటిస్తావా

లేదా ? పిల్లల చేతిలో ఒకవేళ నువ్వన్నట్లు పేలిపోతే మళ్ళీ మంచి విచ్చాలిగాని అలా పేలిపోయిన వాటికి డబ్బులిచ్చుకుంటే పసిపిల్లల్ని అన్యాయం చేసినట్లవుతుంది. చిన్న పిల్లలు నారాయణ స్వరూపాలు."

"మీరూదుకోటాని కొక్కొవాలంటే ఓటిస్తానుగాని పేలిపోయిన వాటికి డబ్బులిచ్చేయండమ్మగారూ ! బూరాలు అమ్ముతాకాని అవి పేలిపోకుండా ఇన్స్యూరెన్సు కంపెనీ ఎట్టలేదండీ" అని నవ్వేడు వాడు.

డబ్బులిచ్చేసి 'పోకిరీ చచ్చినాడా' అని గొణుక్కుంది జానకి మెటికలు విరుస్తూ. మనం బజారుకెళ్ళి యిలా మాట్లాడితే చెల్లుతుందా ? చెల్లదు. పైగా క్రాక్ అని మన మొహంమీదే అనేస్తారు. కాని ది సోకాల్డ్ లేడీస్ ఎలా మాట్లాడినా చెల్లుతుంది. వాళ్ళ ఆర్గ్యుమెంట్సుకి లాజిక్కూ-కామన్ సెన్సూ వుండనవసరం లేదనుకుంటాను.

మేమంతా గదిలో చాపమీద కూర్చుని తీరిగ్గా బఠాణీలూ మరమరాలూ నవుల్తూ కాస్సేపు కబుర్లు చెప్పుకున్నాము. అంతలో మా చంటివాడొచ్చి "నా రూపాయి నా కిచ్చేయ్ నాన్నా ?" అని నుంచున్నాడు కాబూలీవాడిలాగ. వాడి వెనకాలే చంటిది కూడా వచ్చి నుల్చుంది.

"మీ రూపాయి ఏవిట్రా వెధవల్లారా ! ఇంకా ఎక్కడుంది ? బఠాణీలు మరమరాలు బొక్కారుగదా. యివి తేరగా వచ్చాయా ? టమటమాలబండి కొనలేదా, రిబ్బన్లు కొనలేదా ? ఇవన్నీ వూరికే వచ్చాయా ?" అన్నాను. నా మాట వినిపించుకోకుండా నేనేదో చేసినట్లు ఘెల్లుమని శోకాలారంభించాడు. పన్లోపని ఎందుకైనా మంచిదని రెండు తగల్నిచ్చాను. వాళ్ళమ్మ జట్ ప్లేన్లాగా విసురుగా వచ్చి పిల్లల్ని విడదీసి పట్టుకుని "ఎందుకలా కొట్టుకుంటారు? మీవి చేతులుకావా? పసిపిల్లల్ని యెండలో తిప్పడమే గాకుండా ఏదో అడిగితే సరైన సమాధానం చెప్పాలేగాని కొట్టుకుంటారా ? పిల్లలూరికే రాలేదు. నవమాసాలు మోసి కంటే వచ్చారు. మీకేం తెలుస్తుంది ?" అని నన్ను దులిపేసింది.

"అవును. తేరగా మెక్కి రూపాయ తెమ్మని ఏడుస్తున్నారు. ఆ మాత్రం జ్ఞానం వుండద్దూ ?"

"ఇదేమిటి నువ్విలా నా మీద తిరగబడుతున్నావు ? అయినకాడికి అన్నీ చేయించుకుని అంతా నన్ననేవాళ్ళే—"

"అవునండీ మీరు తండ్రి కాబట్టి వాళ్ళు చనువుగా అది కావాలి ఇది కావాలి అని అడుగుతారు. మారాం చేస్తారు. మనం కొనిస్తాం. అది వాళ్ళకేం

అర్థమవుతుందీ. వాళ్ల కెవరో రెండ్రూపాయలిస్తే ఆ రెండ్రూపాయలెట్టి మీరివన్నీ కొనిపెట్టారు గనుక దానికింత చెల్లు అని చెబితే వాళ్ళకు బోధపడుతుందా?"

"అయితే ఆ రెండు రూపాయ లింకా వుందంటావు నువ్వు?"

"అవును మీరు వాళ్ళకి బాకీ. వాళ్ళేడిచింది రైటు అయినా చిన్నపిల్లలకెవరో ఏదో యిస్తే దానిగురించి పిల్లల్నేడిపించటం మీ కేమైనా బాగుందా? ఏవరేనా వింటే నవ్వుతారు?"

"మరి యిందాకెప్పుడో సినిమా కెళ్దామన్నావు. సినిమా కెళ్ళినా ఆ రెండు రూపాయలు అలాగే వుంటుందా?"

"వుంటుందీ వుంటుందీ వుంటుంది."

"ఎలా చెప్పు?"

"ఎలాగేవిటండీ? మనం సినిమా కెళితే మన ఖర్చులో వెదకాంగాని ఎవరో పిల్లల కిచ్చిన రెండు రూపాయలకి మరికొంత వేసి కాదు గదా! అలా కక్కుర్తి పడటానికి మనకేం గతి కడుక్కుపోలేదు. నా మొగుడికి అరువందల్జీతం."

"ఆల్‌రైట్ ఒప్పుకున్నాను. అయితే ఆ రెండు రూపాయలనుంచి నాకు విముక్తి లేదా!"

"ఇలాటివి ఎవరేనా ఇచ్చినపుడు అవన్నీ ఓ చోట వేసుకుని పట్టాలు పట్టు పరికిణీలు ఏవైనా కొనుక్కునేదాన్ని" అని కాళ్ళకేసి చూసుకుంది. అక్కడ పట్టాలు పెట్టుకున్న మచ్చలున్నాయి.

ఆడవాళ్ళ లాజిక్కు ఆడవాళ్ళ ఎకనామిక్స్ వేరని తెలుసుకున్నాను. నాకు యీ రెండ్రూపాయల అప్పునుంచి మా ఆవిడ దయతలిస్తేనే కాని విముక్తిలేదు. పెళ్ళాం దగ్గర అప్పు అది ఒక తీయని బాధ. పైకి చెప్పుకోడానికి వీల్లేని రుణం ఆవిడకెలా తోస్తే అలా దాని వడ్డీ పెరుగుతూ వుంటుంది. ఈ సంసారమనే చెల్లుపడని నోటుమీద ఏ సుముహూర్తానో చేసిన తెలివి తక్కువ సంతకం.

———